క్లుప్తంగా

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మండల పరిధిలోని రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ సిద్ధివినాయక దేవాలయాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధిగణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ శాంతులతో.. ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీటీసీ రాజు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కుమారుడు విక్రమ్‌రెడ్డి, గూడెం సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

జహీరాబాద్ టౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ సుకుమారికి వినతిపత్రం అందజేశారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పేద విద్యార్థులు ఉంటారని, స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్‌పై ఆధారపడి విద్యను అభ్యసిస్తుంటారని తెలిపారు. కానీ.. కొన్ని సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్ బకాయిలు పేరుకుపోయి పేద విద్యార్థులు అవస్థలుపడుతున్నారని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌తో పాటు ఫీజురియింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ప్రవీణ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు మంజూరు చేయాలి

సంగారెడ్డి టౌన్: అందోల్ మండల పరిధిలోని చందంపేట గ్రామంలో వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను మంజూరు చేయాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల అధిక లోడ్‌తో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్లు, బోరుమోటారులు కాలిపోతుండటంతో పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సంభాలు ఏర్పాటు చేయాలన్నారు. చాలామంది రైతులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని డీడీలు చెల్లించినా ఇప్పటివరకూ పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వినతి పత్రం అందజేసినవారిలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయించొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో విజయరత్న

వట్‌పల్లి(అందోల్): నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి విజయరత్న హెచ్చరించారు. అందోలు మండల పరిధిలోని ఎర్రారం శివారులో ఉన్న ఎరువుల దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆధార్‌కార్డు తీసుకువచ్చిన రైతులకు ఈ పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని, ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని ఎంఎస్‌ఆర్ కళాశాలలోని హాస్టల్లో ఫుడ్ సరిగా లేదని యాజమాన్యంకు చెప్పినా పట్టించుకోవడంలేదని నిరసిస్తూ శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ సరైన భోజనం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి సరైన భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

గుంతలమయంగా రహదారులు

- కంకర తేలిన రోడ్లతో తప్పని కష్టాలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

నియోజవర్గం పరిధిలోని ఆయా గ్రామాల రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. ఏళ్లతరబడిగా మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారి దెబ్బతిన్నాయి. రహదారులపై గుంతలు పడి కంకర తేలడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు పంచాయత్‌రాజ్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వ హయాంలో నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ ఆతర్వాత కొత్త ప్రభుత్వం రావడంతో నిధులు రద్దయ్యాయి. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్న అల్గోల్ గ్రామం రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. దశాబ్దాల క్రితం అల్లాన చౌరస్తా నుంచి గ్రామం వరకు నిర్మించిన రోడ్డు అధ్వానంగా మారడంతో పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. వర్షం కురిసిన సమయంలో గుంతల్లో నీళ్ల నిలువడం ద్వారా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.



గుంతలమయంగా మారిన అల్గోల్ రోడ్డు

రద్దయిన నిధులు

గత ప్రభుత్వ హయాంలో అల్గోల్ రోడ్డు మరమ్మతులకు రూ.1.70కోట్లు, బూచినెల్లి, ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి–మొక్కన్‌పాడ్, రాయిపల్లి–కృష్ణపూర్, దేవరంపల్లి–బోప్పన్‌పల్లి, ఝరాసంగం–చిలమామిడి, న్యాల్‌కల్ మండల పరిధిలోని హద్నూర్–రాంతీర్థం, శంశెల్లాపూర్–వడ్డీ, చాల్కి–కర్నాకట రాష్ట్ర సరిహద్దు, గంగ్వార్–బసంత్‌పూర్–మామిడ్గి, కోహీర్ మండల పరిధిలోని బడంపేట–మనియార్‌పల్లి, పోత్‌రెడ్డిపల్లి–కోహీర్, పిచరాగడి–పిచరాగడి తండా, ఖనాపూర్–సజ్జపూర్, శేఖాపూర్–బడంపేట రోడ్ల మరమ్మతుల కోసం రూ.51 కోట్లు మంజూరు కాగా ఆతర్వాత కొత్త ప్రభుత్వం రావడంతో నిధులు పూర్తిగా రద్దయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకుని రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రోడ్ల మరమ్మతుల్లో అధికారులు నిర్లక్ష్యం ఉంది. గత ప్రభుత్వంలో నిధులు ఉన్నప్పుడు పనులు చేపట్టకుండా మూడేళ్ల పాటు నిర్లక్ష్యం వహించారు. అల్గోల్ రోడ్డు దెబ్బతిని రాకపోకలకు చాలా కష్టమవుతోంది. మోటారు బైక్‌పై కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. వానాకాలంలో నరకం చూస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి అల్గోల్ రోడ్డుకు మరమ్మతులు చేయించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, అల్గోల్

ప్రతిపాదనలు పంపుతాం

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 26 రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైన మాట వాస్తవమే. కానీ.. టెండర్ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. ఆ తరువాత పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ సకాలంలో పనులు ప్రారంభించలేదు. ఇదే క్రమంలో ప్రభుత్వం మారడంతో నిధులు రద్దయినవి రోడ్ల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నాం.

– కృష్ణ, ఏఈ పంచాయత్‌రాజ్

శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఆరోగ్యం బాగుంటేనే జీవితం బాగుంటుందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని జూకల్ శివారులోని ఎస్టీ బాలుర మినీ గురుకులంలో శుక్రవారం సికిల్‌సెల్ అనిమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు శుభ్రతను పాటిస్తూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది తమ పిల్లల్లా చూసుకుంటూ నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సికిల్‌సెల్ అనిమియా వ్యాధి లక్షణాలు, సోకకుండా జాగ్రత్తలను తీసుకోవాలని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు పంపిణీ చేశారు. తుర్కపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి హరిణి, గురుకులం ప్రత్యేక అధికారి బాలమణి, సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, అవుటి శంకర్ ముదిరాజ్, సిద్దారెడ్డి, పరశురాం, శ్రీకాంత్ పాల్గొన్నారు. మండల పరిధిలోని లింగాపూర్‌కు చెందిన మహ్మద్ యాదుల్ ఇటీల కేంద్ర స్కిల్‌డెవలప్‌మెంట్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా స్కిల్స్–2024లో వెండి పతకాన్ని సాధించగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు.



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): బీరు సీసీల గోదాం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొండాపూర్‌లోని తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నర్సింలు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మల్లెపల్లి, మాదాపూర్ గ్రామాల్లో బీరు కంపెనీ సీసాల గోదాంలు 6 చోట్ల నిర్వహిస్తూ సుమారు 400 మంది కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నాడని కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, అస్సాం రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకువచ్చి వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా ఈఎస్‌ఐ, పీఎఫ్, బోనస్, ఓటీ డబుల్, గ్లౌజ్‌లు, షూస్, క్యాంటీన్ సౌకర్యాలు కల్పించకుండా వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా పురుషులకు ఒక రోజు వేతన రూ.500, స్త్రీలకు రూ.450 ఇస్తూ సీసాలు తగిలిన వారికి ఎలాంటి హాస్పిటల్ ఖర్చులు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు వెంటనే కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

‘అధ్యాపక’ పోస్టులకు ఆహ్వానం

నారాయణఖేడ్: ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకులుగా బోధించేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు–1, ఆంగ్ల–2, కెమిస్ట్రీ–1, జువాలజీ–1, కంప్యూటర్ సైన్స్–1, కామర్స్–2, హిస్టరీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ కలిగి ఉండి 55 శాతం మార్కులు పొంది ఉన్నవారు అర్హులు కాగా అదనపు అర్హతలుగా నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌ఎ కల్గి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్నవారు 3వ తేదీన ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే డెమో, ముఖాముఖికి హాజరు కావాలన్నారు. ఇతర వివరాల కోసం 7673967514 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ పేర్కొన్నారు. కళాశాలలో ఉర్దూ–1, కామర్స్(ఉర్దు మీడియం)–1, కెమిస్ట్రీ(ఇంగ్లిష్ మీడియం)–1, కెమిస్ట్రీ(ఉర్దూ మీడియం)–1, కంప్యూటర్ అప్లికేషన్స్(ఇంగ్లీష్ మీడియం)–1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. పీహెచ్‌డీ, నెట్‌సెట్ బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికెట్లతో జులై 2 తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూ తేదీ, స్థలం ఫోన్‌లో సమాచారం అందిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థుల సేవలు విద్యా సంవత్సరం ముగిసేవరకు మాత్రమే వినియోగించుకుంటామని పేర్కొన్నారు.

పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంగ్లీష్, గణితం, కామర్స్, కంప్యూటర్స్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల(గెస్ట్ ఫ్యాకల్టీ) కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు పీజీ (పోస్ట్ గ్రాడ్యుయేషన్) లో సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు.నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పై సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకునేవారు, అన్ని సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జూలై 2వ తేదీ సాయంత్రం 4గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరులో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూలై 3వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డిలో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో..

జోగిపేట(అందోల్): నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులకు గాను అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఆంగ్లం–1, తెలుగు–1, చరిత్ర–1, పొలిటికల్ సైన్స్–1, కంప్యూటర్ సైన్స్–1 విభాగాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం, ఇతరులకు 55శాతం ఉత్తీర్ణత కలిగి ఉండి జులై 2న సాయంత్రం 5గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 4వ తేదీ ఉదయం 10 గంటలకు సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు.

మాజీ సీఎంను కలిసిన బీఆర్‌ఎస్ శ్రేణులు



మాజీ సీఎం కేసీఆర్‌తో నాయకులు

పటాన్‌చెరు టౌన్: మాజీ సీఎం కేసీఆర్‌ను ఎరవ్రల్లి ఫామ్‌హౌస్‌లో పటాన్‌చెరు మాజీ వార్డు మెంబర్ కొత్తగొల్ల మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు సాయి, రాము, సురేష్, లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు.

నీటి ట్యాంకర్లు స్వాధీనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని వ్యవసాయ భూమిలో నీటి వ్యాపారం నిర్వహిస్తున్న ప్రదేశానికి తహశీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి చేరుకొని 5 నీటి ట్యాంకర్లును సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా నీటి వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసీ ఆధ్వర్యంలో స్క్వేర్ సహకారంతో ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. డిగ్రీతో పాటు ఎమ్మెస్సీ బీకాం ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. పూర్తి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జత జిరాక్స్ కాపీలను తీసుకొని ఉదయం 9:30 వరకు కళాశాలలో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 7989239115 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



జహీరాబాద్: చంద్రశేఖర్ ఇంటి ఆవరణలో వికసించిన బ్రహ్మకమలం



జహీరాబాద్ టౌన్: వేణుగోపాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో విరబూసిన బ్రహ్మకమలం

వికసించిన బ్రహ్మకమలం

జహీరాబాద్ టౌన్: హిమాలయ పర్వతాలు..శీతల ప్రదేశాల్లో సంవత్సరానికి ఒకసారి మాత్రమే అరుదైన బ్రహ్మకమల పుష్పాలు శుక్రవారం రాత్రి వికసించాయి. దీంతో స్థానికులు పూజలు నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన బర్దిపూర్ వేణుగోపాల్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఉన్న బ్రహ్మకమలం వికసించింది.

నాగలకట్ట కాలనీలో...

జహీరాబాద్: పట్టణంలోని నాగలకట్ట కాలనీలో బ్రహ్మకమలం పువ్వు వికసించింది. శుక్రవారం రాత్రి కాలనీకి చెందిన బెండి చంద్రశేఖర్‌కు చెందిన ఇంటిలో బ్రహ్మకమలం పూవు వికసించడంతో పూజలు చేసి దర్శించుకున్నారు. హిమాలయ పర్వతాల్లో అరుదుగా లభించే బ్రహ్మకమలం మొక్కను ఇంట్లో నాటుకున్నారు.



కంది చౌరస్తాలోని గుంత పూడ్చుతున్న పోలీసులు

గుంతలు పూడ్చి.. చింతలు తీర్చి

ముంబై–హైదరాబాద్ జాతీయ రహదారిపై కంది చౌరస్తా యూటర్న్ వద్ద ఉన్న గుంతలతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడితే వారి బాధలు వర్ణనాతీతం. అందుకే ప్రయాణికుల బాధలు తీర్చాలనే ఉద్దేశ్యంతో పోలీసులు స్వయంగా ఆ గుంతలను పూడ్చివేశారు. సిమెంట్ కంకర మిశ్రమం కలిపి పారతో రోడ్డుపై లెవెల్ చేశారు. ప్రయాణికులు పోలీసుల చొరవను చూసి వారు పనిచేస్తున్న దృశ్యాలను ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పంచుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

సంక్షిప్త వార్తలు

◆ **ఫిలిం కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం**



జహీరాబాద్: రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జహీరాబాద్‌లోని మహీంద్ర కర్మాగారం నాయకులు శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

◆ **ప్రధానోపాధ్యాయుల ఏర్పాటు**

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఆయా ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం ఏడుగురు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసిందని ఎంఈఓ దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాటిపల్లి, మునిపల్లి, లింగంపల్లి, గోపులారం, బుదేరా కంకోల్, ఖమ్మంపల్లి గ్రామాల్లో ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు.

◆ **సదరం క్యాంపునకు స్లాట్స్ బుకింగ్**

కంగ్టి(నారాయణఖేడ్): వచ్చే నెల 9వ తేదీన సంగారెడ్డిలో నిర్వహించే సదరం శిబిరానికి హాజరయ్యే అభ్యర్థులు మంగళవారం 2వ తేదీన మీ–సేవ కేంద్రంలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఎంపీడీఓ సత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై రెండో మంగళవారం సదరం క్యాంప్‌నకు వెళ్లేవారు దివ్యాంగత్వం ఉన్న స్లాట్ మాత్రమే బుక్ చేసుకొని రసీదు, అధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫోటో, సంబంధిత మేడికల్ రిపోర్టులతో హాజరు కావాలని సూచించారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**



ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఎంపీటీసీ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రమ్య, గ్రామపెద్దలు కోట కృష్ణ, బాలరాజ్, దిగంబర్, మానెప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఏవీఆర్ కాలుష్య పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ పీసీబీ జిల్లా అధికారి గీతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమ నుంచి బయటకు వస్తున్న వాయు కాలుష్యంతో పరిశ్రమ పరిధిలోని గ్రామాల ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో నాయకులు శివకుమార్, సాయి, మల్లేష్, రాజు ఉన్నారు.

◆ **బహిరంగ వేలం**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరభద్రస్వామి దేవాలయంలో పార్కింగ్, అమ్మవారి చీరల విక్రయం, ఒడి బియ్యం, స్వామివారి వస్త్రాలను వేలం వేసే ప్రక్రియను జులై 3న నిర్వహించనున్నట్లు ఈఓ శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు దేవాలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

◆ **ఓడీఎఫ్ సీజీఎంకు సన్మానం**



కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దుమైలారం ఆయుధ కార్మాగారం (ఓడీఎఫ్) చీఫ్ జనరల్ మేనేజర్ సుధాకర్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఓడీఎఫ్ అధికారులు శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ సీజీఎం సుధాకర్ యుద్ధ ట్యాంకుల నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. చాలాకాలంగా ఓడీఎఫ్‌లో సేవలు అందించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, సంతోషంగా గడపాలని ఆకాక్షించారు.

◆ **పీసీబీ అధికారులకు ఫిర్యాదు**



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కాజీపల్లి పారిశ్రామికవాడలో పరిశ్రమలు వదులుతున్న కాలుష్యంపై జేఏసీ నాయకులు శుక్రవారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమల యాజమాన్యాలు జల, వాయు కాలుష్యాలను వదులుతున్నాయన్నారు. దీంతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి కాలుష్యాన్ని వదులుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌యాదవ్, మహేష్, శ్రావణ్ పటేల్, వెంకట్, భరత్‌చారి, హుస్సేన్, బాలు, నరసింహ పాల్గొన్నారు.

◆ **యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిని కలిసిన ప్రొటోకాల్ చైర్మన్**

పటాన్‌చెరు: అఖిల భారత యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి, పటాన్‌చెరు పట్టణానికి చెందిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రొటోకాల్ చైర్మన్ డాక్టర్ ఆదిత్యరెడ్డి శుక్రవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆత్మకమిటీ డైరెక్టర్‌కు సన్మానం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పెద్దాపూర్ గ్రామానికి చెందిన ముత్కని మల్లేశంను మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమార్‌గౌడ్, గిర్మాపూర్ మాజీ సర్పంచ్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. నాయకులు నరేందర్, మొగులయ్య పాల్గొన్నారు.

